# ఏడువేల ఎనిమిది వందలు

మంచి తృప్తిగావున్న సమయాల్లో ఇల్లంతా కలయజూచి జగన్నాథం పంతులు భార్యతో — 'ఒక్క నువ్వు తప్ప తక్కిన ఈ సంసారమంతా నా స్వార్జితమే కదూ!' అనేవాడు, తన తృప్తిని మనసులో అణచుకోలేక.

'ఉద్యోగం చేస్తేనే కాని సార్థకం చేసుకోనని పట్టుబట్టేరు కదూ; అందుచేత నేనూ మీ సంపాదనలోకే వస్తా' ననేది, అంతకంటె తృప్తిగా అతని భార్య అన్నపూర్ణమ్మ.

మొదటే తల్లిదండ్రులతో కలిసి నలుగురున్న కుటుంబం, రాను రాను ఎంత పెరిగినా గుట్టుగా గుంభనగా తనూ భార్యా సంసారం గడుపుకోని రాగలగడమే అతని తృప్తికి ప్రధాన కారణం. దమ్మిడీ అప్పు చెయ్యకుండా పదిమంది ఉన్న సంసారాన్ని తిప్పుకు రావడమంటే మాటలా?

ఇంతటి తృప్తికి కారణభూతమయిన జగన్నాథం పంతులు సముపార్జన శక్తి ఎంతటిదో అనిపిస్తుంది, కేవలం పై మాటలనుబట్టే మనం లెక్క కట్టే మాటయితే.

బి. యే. పాసయిన తక్షణం రోజుకి రూపాయి జీతంలో కుదురుకొని, అనేక మజిలీలమీదుగా, రిటైరవడానికి మూడేళ్లుందనగా రోజుకి నాలుగు రూపాయల జీతమనే అవధిని చేరుకొన్న ధన్యుడూ పురుషమూర్ధన్యుడున్నూ జగన్నాథం పంతులు.

పెద్దమ్మాయి శాంత పెళ్లికని ఉన్న ఒక్క మడిచక్కా అమ్మగావచ్చిన పదిహేను వందలూ వినా 'తనదీ' అని ఎన్నడూ ఒక వెయ్యి రూపాయిలకు పైగా కళ్ళచూడని వ్యక్తి జగన్నాథం పంతులు. తనదే కాదు పై వాళ్ళదైనా వందలూ వేలూ తన చేతులమీదుగా చలామణీ అయ్యేరకం ఉద్యోగం కాదతనిది. ఎప్పుడో హెడ్మాష్టరు శలవులో ఉండడమూ, తాను హెడ్‌మాష్టరు ఇన్‌ఛార్జిగా ఉండడమూ సంభవించిన కొద్ది సమయాల్లో మాత్రమే అయి

దారువేలు తన చేతుల్లోకి ఎంతో గాభరాకి కారణంగా రావడమూ, వెంటనే అంతర్ధాన మవడమూ జరిగేది, అంతే — అటువంటి జగన్నాథం పంతులు ఒక్కమారుగా 'ఏడువేల ఎనిమిది వందల' పైచిలుకు తన చేతికి వస్తున్నదంటే ఎంతయినా ఆనందించవలసిందే—

కాని, ఇప్పుడతనికి ఆనందం కలగకపోవడం కాదు, మునుపటి ఆ తృప్తి కూడా లేదు. ఈ ముప్పై అయిదేళ్ళ కష్టానికీ ఫలితంగా మిగిలిన ఆ ఏడువేల ఎనిమిది వందలూ చేతికి వస్తున్నాయంటే, ఏదో బ్రహ్మాండమైన ఆందోళన.

ఎలాగూ నౌఖరీ పొడిగింపు జరగదుకదా అని ఉన్న శలవంతా పెట్టేశాడు రిటైరవడానికి ముందుగా.

మామూలు సమయాల్లో తీరికగా కూర్చుంటేనే ఎన్నో కలలూ భ్రమలూ వచ్చి పోతూంటాయి మనఃప్రత సీరమీదికి. అటువంటిది ఈ రకమైన సందిగ్ధావస్థలో, ఇన్నాళ్ళుగా అలవాటుపడిన జీవిత విధానంలోంచి తప్పని సరిగా తప్పుకోవలసి వచ్చి ఏ కొత్తపంథా ననుసరించడానికయినా సరే సావకాశమూ, సామర్థ్యమూ ఇంతెందుకు, సర్వస్వమూ ఆ ఏడువేల ఎనిమిది వందలేనన్న సమయంలో చేసే ఆలోచనలకీ, వేసే పథకానికీ ఒక అంతు ఉంటుందా ?

నిరాడంబర జీవితమూ, ఉన్నతోన్నత, ఊహాసంపదా—ఇవి రెండూ ఉపాధ్యాయ వృత్తిలోనే లభిస్తాయని తాను చిన్నతనంలో విన్న లోకోక్తిని జగన్నాథం పంతులు చాలాకాలం వేదవాక్కులాగే విశ్వసించాలని యత్నించాడు. కాని సంసారం మరి కొంచెం కొంచెం పెరుగుతున్న కొద్దీ నిరాడంబర జీవిత మన్నది సైతం ఎంతో డబ్బు వుంటేనేకాని సాధ్యంకాదన్న నగ్న సత్యాన్ని అతడు క్రమేపీ గుర్తించవలసి వచ్చింది. ఇక రెండురోజులు జీతం అందడం ఆలస్యం అయితే నిత్యకృత్యం గడవదన్న పరిస్థితిలో తక్కిన ఊహాలూ ఉద్దేశాలూ ఏం నిలుస్తాయ్ ? ఉన్న గొప్ప సమస్య అల్లా, నియమితంగావచ్చే ఆ కొద్దిపాటి డబ్బుతో అనియమితంగా అనంతంగా వచ్చే అత్యంతవసరాలకు గాను (విలాసాలు కాదు, కేవలం అవసరాలే) సర్దుబాటు చేసుకొని రావాలి. మధ్యతరగతి జీవితానికి తిరుమంత్రం సర్దుబాటు సవ్యంగా సర్దుబాటు జరడ మన్నది గొప్పమాటే.

దేవుడు చల్లగా చూడ్డంవల్ల కాదు, నెలకింతా అని రావడం వల్ల ఎలాగోలాగు ఇంతకాలమూ గడిచిపోయింది. ఇక నెలాగా ? ఏమిటి ? అని ప్రశ్న.

"ఇన్నాళ్ళూ అంటే బదిలీ అవుతుందేమోనని బెంగ. ఇక వదిలేదు కదా మనదీ అని ఒక ఇల్లుముక్క ఉంటే"...ఇది భార్య అన్నపూర్ణమ్మ మతము.

"మంచిమాటే, కాని కొనవద్దూ ఈ పెద్ద ఖరీదుల్లో ?" అతని ప్రశ్న.

"కొనకపోతే నెలానెలా అద్దె ఇవ్వొద్దూ ? మునుపటిలా జీతం ఉండదు కదా !" ఇది ఆవిడ అడ్డు ప్రశ్న.

"వచ్చేది కాస్తా ఇంటికింద పెట్టేస్తే తరవాత ఏమిటి తింటాము" ఇది ఆయన సమాధానం.

ఊఁహూఁ కుదరలేదు. వచ్చేరి అభిప్రాయభేదం ఆలుమగల నడుమను. ఒక్క భార్యతోనే కాదు. ఇంట్లో అందరి తోనే అభిప్రాయ భేదం వచ్చింది ఆ యజమానికి.

పెద్దబ్బాయి నారాయణరావు మళ్ళీ తనలాగే ఉపాధ్యాయ వృత్తిలో ఈదులాడుతున్నాడు. వెధవ బి. యే. ఈ రోజుల్లో ఏమీ లాభంలేదు. అయితే అయిందని ఇక మూడువేలు క్లుప్తంగా వాడుకుంటే రెండువేలయినా నాన్నా ఒక్క రెండేళ్ళు ఓపికపడి యమ్ ఏ. చదివేస్తే నెలకి రెండువందలకి తక్కువకాకుండా తెచ్చుకుంటూ లెక్చరనిపించు కోవచ్చును." ఇదీ వాడి ధోరణి. మంచిదే వాడు లెక్చరరు కావడం అన్నివిధాలా కోరదగినదే కాని ఈ లోపుని కథ నడవడం ఎల్లాగ ? నెలకి వాడొక డెబ్భై ఎనభైరూపాయలు తెస్తూంటేనే ఇల్లుగడవడం కష్టసాధ్యంగా ఉందికదా అలాంటిది వాడు రెండేళ్ళపాటు దమ్మిడీయేనా తేవపోవడం అటుండగా ఒక్కడి క్రింద రెండు మూడువేల ఖర్చంటే మాటలా ? తీరా చదివినా అందులో క్లాసు రాకపోతే మళ్ళీఏమీ ప్రయోజనం లేదు. మామూలు మాష్టారు గిరీయే. ఊఁహుఁ ఒక్కడి మీద అంత డబ్బు ఖర్చు పెట్టటానికి తనకు తాహతు చాలదు.

ఇక రెండవవాడు గోపాలం తాను చూసిన ఇంగ్లీషు హిందీ సినిమాలు, చదివిన హిందీ పత్రికలూ నేర్చిన సినిమాపాటలూ వీట్లమూలంగా తానొక పెద్దసినిమా యాక్టరూ డైరెక్టరూ అయిపోయినట్లుగానే వాడిలెక్క. ఏయే తారలకి ఎంతెంత జీతాలో ఏయే డైరెక్టర్లు ఎంతెంతగా కీర్తిని సంపాదించారో,

ఏయే ప్రొడ్యూసర్లు ఎంతెంతగా దేశాన్ని దోచుకుంటున్నారో ఇదే వాడి నిత్య స్మరణ. చదువా ఇంటర్మీడియేటు రెండుమార్లు పోవడంతో ఆగిపోయింది. అది మరి పూర్తిచేసే పూనిక లేదు. పోనీ కరువురోజులు ఏ రేవను ఆఫీసులో నయినా కుదురుకోరా అన్ని విధాలా పనికి వస్తుందంటే అదీలేదు, లేకుంటే సెకండరీగ్రేడు ట్రెయినింగుకు వెళ్ళరా అంటే అబ్బే పరువుతక్కువ, ఎలాగూ వేగడం. తిండి గడిచిపోనూ నెలనెలా పదీ పదిహేనూ పైఖర్చుకి కావాలంటే ఎక్కణ్ణించి వస్తుంది. ఒక్క రెండు వందలయితే చాల్నంటాడు. వీడు ఇలా మద్రాసు బొంబాయి కలకత్తా పర్యటనం చేసేసరికల్లా ఇల్లా వీడున్నచోట డబ్బు వర్షం కురిసిపోతుందని ఏంచేస్తాం. ఎవడి వెఱ్ఱి వాడిది. ఇదేవో రావడం చూసుకొని ఒక వందో యాభైయో పారేసి నీ బ్రతుకు నువ్వు బ్రతకరా అని చెప్పెయ్యాలి. చేతకాక తిరిగివస్తే ఏదో తా నున్నంతకాలం ఇంత తిండి పడేస్తాడు. అంతే తరవాత ఎవరి ఖర్మం వాళ్ళది.

మగపిల్లలయితే ఎవళ్ళ ఖర్మం వాళ్ళది అని వదిలేయవచ్చునుగాని ఆడపిల్లసంగతెలాగ? రాధమ్మ ఆ కృష్ణమోహన్ నే తప్ప చేసుకోనంటోంది. స్కూలులో స్నేహాలకీ నిత్యజీవితంలో వ్యవహారాలకీ కుదురుతుందా? వాళ్ళ అంతస్థు వేరు. ఒక్క మూడువేలు కట్నమిస్తే చాలు నన్నాడంటుంది. అదేనా వాళ్ళు వాళ్ళను తృప్తిపరచడానికోసమే తప్ప తనకోసం కాదట అంటుంది. ఎలా అయితేం మూడువేలంటే సామాన్యమా? మరొక సంగతి. వాళ్ళవాళ్ళని తృప్తిపరచడానికి మూడువేలు కట్నం కావాలన్న మనిషి రేపొద్దున్న వాళ్లు పదివేలు కట్నంపుచ్చుకుని ఇంకొక పెళ్లాన్ని చేసుకోమంటే చేసుకోవడానికి ఏమిటి నిదర్శనం. ఊఁహూఁ ఇవంతా అక్కరలేదు. దానికి ఒక్క మూడువేలు కదా అని తన స్నేహితురాళ్ళ పెళ్ళిళ్ళకి ఎంతెంత కట్నాలిచ్చారో అమాయకంగా లెక్క పెడుతుంది. అంతా మీది చూపేగాని కిందిచూపు లేకపోవడం వల్ల వచ్చే అనర్థం ఇది. బాగావచ్చి వున్నవాళ్ళకు మూడువేలంటే సామాన్యంగానే తోచవచ్చును. గాని సర్వస్వమూ ఆ ఏడు వేల ఎనిమిది వందలేనన్న తనవంటివాడు ఒక్క పెళ్ళికోసం మూడువేలు మూడువేలేమిటి? ఖర్చులతో కలిపి అయిదు వేలయి తీరుతుంది. ఒక్కమారంత మొత్తం ఖర్చుపెడితే తర్వాత నిత్యకృత్యం గడవడం ఎల్లాగ?

సరిగా మాటల్లో అయితే చెప్పలేరుగాని తక్కిన చిన్నపిల్లలకీ ఇలాటివే అభూతమైనవీ అతిలోకమయినవీ ఆలోచన లుండిఉంటాయి.

ఇక తన అభిప్రాయాలూ ప్రయత్నాలున్నా వాటికోక అంతూ పంతూ అనేదే లేదు.

ఆలోచించినంత కాలం లేదు. రిటైరైయిపోవడమూ డబ్బు చేతికికూడా రావడమూ జరిగింది. ఇక నేమిటి చెయ్యడం ?

నిద్రలేవడమే ఆలోచిస్తూ లేచేవాడు. తరువాత భార్య కాఫీ చల్లారిపోతున్నదని ఎంతోతొందర చేస్తేనే గాని పళ్ళు తోముకోవడం తెమిలేది కాదు. ఏవో అనంతమయిన ఊహాలు కాఫీ పుచ్చుకున్న తగవాత తీరుబాటుగా పడకకుర్చీలో కూర్చొని పలకా పుల్లా కాగితాలూ కలం దగ్గర ఉంచుకొని ముందుగా అదివరకు వ్రాసిన కాగితాలన్నీ చదవడం వాటిలో అక్కర్లేనివి చించి పారెయ్యడం తరవాత మళ్ళీ క్రొత్తగా రాస్తూవుండడం అతనికి ఒకమాదిరిగా తెలుసును. తాను చేసే లెక్కలూ, వేసే ప్లానులూ మార్నాటికే పనికి రానివిగా చించి పారెయ్యవలసినవిగా తోస్తాయని అయితేమాత్రం ఏదో పథకం వెయ్యకపోతే ఎల్లాగ ? కూర్చొని తింటె కుబేర్లుగోపురాలూ చాలవు కదా. తన ఏడువేల ఎనిమిదివందలనగా ఎంత ?

తన భార్య చెప్పినమాటలోనూ కొంత సత్యం లేకపోలేదు. నెల నెలా అద్దె యిచ్చుకోవడం అందులోనూ నెలజీత మన్నది లేనప్పుడు కష్టమే. అయితే ఉన్న సర్వమూ పెట్టి ఒకఇల్లు కట్టేసుకొని అదంతా ఆక్రమించుకొని కూర్చుంటె లాభంలేదు. సరీగా అద్దెల కివ్వడానికి తగిన పంపిణీలో కట్టాలి. కొంచెం ఊరికి దూరమయితేనేం ఇప్పుడక్కడా చాలామంది ఉంటున్నారు. సుబ్బయ్య కోనేరుదగ్గర జాగాలు చాలా చవగ్గా ఉన్నాయట. అక్కడ తాము ఉండగా మరి అయిదారు కుటుంబాలకి అద్దెకివ్వడానికి వీలయిన ఇల్లు ఎంత తక్కువ ఖర్చుతో ఎంత నేర్పుగా కట్టవచ్చునో ఇదీ అతని ప్లాను.

ఒకొక్కొక్కనాడు భార్యను సగంనిద్రలో లేపి, తాను తయారుచేసిన ప్లానులూ ఇల్లు కట్టడానికయే ఖర్చుల లెక్కలూ చూపించేవాడు. ఆవిడ అమాయికంతో కూడిన నిద్రబరువుతో, నా కిదేం తెలుస్తుందండీ, ఇల్లా అంటే కంటితో చూస్తే ఆనుతుందిగాని, ఇల్లా గీతల్లో అంకెల్లో ఏం తెలుస్తుంది ? అనేది. అవునవును నీకేం తెలుస్తుందిలే. కాని, చూడు ఇదిగో ఇక్కడ నుయ్యి ఉందా. అక్కడే అయినప్పటికి ఒక వాటావాళ్ళు ఇంకో చోటులోంచి రానక్కరలేకుండా వేరువేరు దారు లున్నాయి—ఇదిగో ఈ చిన్న చిన్న గీత

లున్నాయి, యివి నూతిదగ్గర హద్దుగోడలు. ఏ వాటావాళ్లు ఆ వాటా హద్దు దగ్గర నిలబడి తోడుకోవలసిందే—ఇలా అయితే ఒకళ్ళతో ఒకళ్ళకి ఏ ఘర్షణా రాదు. ఇలాగని, ఇల్లు కట్టడమేమో సొంతమయి తరువాత చిన్న చిన్న విషయాలే మిగిలిఉన్నట్లు మాట్లాడేవాడు—అతనలా చెప్పుకుపోతూ ఉండగానే ఆవిడకి నిద్రపట్టేసి. చిట్టచివరకి, అతని లెక్కలూ ప్లానులూ పూర్తి అయి, జాగా కొనడానికి శుభముహూర్తాన బయలుదేరేసరికల్లా జాగాలు చాలావరకూ అమ్ముడయిపోయినట్లూ మిగిలివున్న కొద్దిపాటి స్థలాలు ఖరీదు నాలుగురెట్లు పైగా పెరిగిపోయినట్లూ తెలిసింది. తాను కొన్నదూదిరిగా ఇల్లు కట్టడానికి స్థలానికే సుమారు అయిదువేలయేలాగుంది. ఇక ఇల్లు కట్టడపు ఖర్చులు ఈ రకంగానే పెరిగివుంటే—పెరగకపోయినా అయిదారువేలు కావాలాయను. ఉఁహుఁ ఎందుకూ చాలదు. తన ఏడువేల ఎనిమిది వందలున్నా.

తరువాత, ఏదయినా షాపు పెట్టడం గురించి, ప్రింటింగు ప్రెస్ కొనడం గురించి, కేవలం బంగారు వెండివస్తులు తాకట్టు పెట్టడం గురించి, తన వంటి మరి కొంతమందితో కలిసి కోఆపరేటివ్ సంఘం (సహకార సంఘం) ఒకటి స్థాపించి, అటు ఖద్దరు వ్యాప్తికి తోడ్పడుతూ ఇటు జీవికను సాధించడం గురించీ, చవగ్గా వచ్చే విశాలమయిన భూముల్ని ఒకచిన్న ట్రాక్టరు సహాయంతో (పదిమంది కలిసి) ఆధునిక పద్ధతుల్ని వ్యవసాయం చేయించడం గురించీ, ఓ ఒకటేమిటి, లెక్కలేనన్ని పథకాలు వేసేడు—అయితే, ఏమి చెయ్యడానికీ సాహసించలేకపోయాడని వేరే చెప్పాలా? ఇంతకీ వెధవ ఏడు వేల ఎనిమిది వందలున్నా, ఏ పనీ సాహసించి చెయ్యడానికీ చాలవు—అని విసుగుకొనేవాడు.

పోనీ ఏదైనా ఉద్యోగంలో ప్రవేశిద్దామంటే, మళ్ళీ మాష్టరు గిరీకే సిద్ధపడాలి. అదయినా ఒకటంతటు దొరకదు—దొరికినా, ఏవో చిన్న క్లాసులకి పాఠాలు చెప్పాలి, మునపటి జీతంలో మూడవ వంతు పుచ్చుకొని. అక్కడికీ సిద్ధపడినా స్థయిర్యం ఉండదు. నిన్న మొన్నటివరకూ మంచి సమర్థుడూ, అనుభవజ్ఞుడు అయిన విద్యార్థుల దృష్టిలోకూడా తాను పలచబడిపోదనుకోందికి సావకాశం లేదు. ఉఁహుఁ నౌఖరీ మరి లాభంలేదు. అయితే ఏం చెయ్యడం? ఏం చెయ్యడానికీ చాలదు తన డబ్బు. ఏమాత్రం సాహసించినా

సర్వమూ గంగలో కలిసిపోతుంది. అలాగని ఊరికినే పట్టుకు కూర్చుంటే—అప్పుడూ క్రమంగా హరించిపోతుంది, ఏమిటి సాధనం?

*    *    *    *

అసలే వంట్లో బాగులేదు. వెళ్ళవద్దని భార్య ఎంత చెప్పినా లక్ష్య పెట్టకుండా ఏజన్సీ ప్రాంతంలో భూములు చవగ్గా వస్తున్నాయని తెలిసి బయల్దేరేడు, భూములేమో ఉన్నాయి. చవగ్గానూ వస్తాయి. గాని అక్కడ దున్నే నాథుడేడీ? ఆ ప్రాంతాల్లో కొండవాళ్ళకి ఏమిచ్చినా వాళ్ళకి కావలసిన జొన్నలూ చామలూ మొదలైన పంటలు మాత్రమే పండిస్తారు. అవీ వాళ్ళకి కావలసినపాటి మాత్రమే. లేక ఇతర ప్రాంతాలనుండి రైతులను తీసుకొని వస్తే—ఉన్న ఊళ్లో పస్తయినా ఉంటారుగాని ఏజన్సీ అంటే ఎవడూ రాడు. పోని, ఏజన్సీ సరుకులను చవకగా కొని, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తే—దాన్లోనూ ఎన్నో కష్టనష్టాలున్నాయి. ఏ విషయంలోనూ అతడొక నిశ్చయానికి రాకముందే బ్రహ్మాండమయిన జ్వరం వచ్చింది. ఎలా తిరుగుముఖం పట్టాడో అతనికీ తెలీదు—రైల్లో స్పృహతప్పి ఉంటే పూర్వ విద్యార్థులు కొందరు చూసి కారుమీద ఇంటికి తీసుకొని వచ్చారు.

టైఫాయిడ్, మలేరియా, ఇన్‌ఫ్లుయంజా మొదలయిన అన్ని జబ్బుల అవలక్షణాలూ పరిమిళితమై ఉండటంవల్ల జ్వరం ఏ రకమయిందీ నిశ్చయంగా తేలలేదు—కాని, జగన్నాథం పంతులుకిమాత్రం పూర్వపు అనిశ్చితత్వం లేదు. సర్వమూ నిశ్చయమై తానెంతో సంపన్నుడయినట్లుగానే ఉండేది అతని కలవరింతల ధోరణి.

'ఇల్లో ఇల్లన్నావు; పోనీ నీమాటే అయింది. నువ్వుండగా నెలకి ఎనభై రూపాయలు అద్దె వస్తున్నది'—ఎక్కడికి ఆశ.

'ఒక్క ట్రాక్టరుతో మనం ఏమి వ్యవసాయం చెయ్యగలమండీ? అథమం ఒక మూడైనా ఉంటేనేగాని మన కంపెనీ పని చురుకుగా సాగదు.'

'ఇది నీరసబంగారం లాగుంది, అమ్మితేనే మూడువేలకంటె ఎక్కువ వచ్చేలా లేదు. పదిహేనువందలా, వెయ్యిరూపాయలకంటె ఒక దమ్మిడీ ఎక్కువ ఇయ్యలేను ఇష్టంలేకుంటె ఇంకొకచోటికి వెళ్ళవచ్చును.

మొన్నటి బేరంలో నాకు ఒక్క ఆవాలమీద రెండువేలు దెబ్బ తగిలింది. అయితే తక్కిన పప్పుదినుసులూ చింతపండూ ఉండబట్టి సర్దుకున్నాననుకో.

లాభం అవనీండి; నష్టం అవనీండి; మనం ఓ కొత్త పరిశ్రమ స్థాపిస్తున్నప్పుడు అన్నిటికీ సిద్ధపడాలి. నా మట్టుకు నేను ఒక ఇరవైవేలకంటె ఎక్కువ పెట్టలేను అనుమానంగా ఉన్నదానికోసం, చేతిలోఉన్న వ్యాపారం పాడుచేసుకోలేం కదా ?

పై రకపు ప్రలాపాన్ని కట్టించడానికి డాక్టరుగారికి బ్రహ్మప్రళయమయినంత పనయింది. కలవరింతలు కట్టుబడడంలో రోగం లొంగుబాటులోకి వచ్చినట్టె చూపించింద కాని, ఉన్నట్టుండి, ఒకనాడు రాత్రి హఠాత్తుగా కలవరింతలు ప్రారంభమయినాయి. డాక్టరుగారికి కబురు వెళ్ళి ఆయన వెళ్ళి ఆయన వచ్చేలోపునే సర్వం సాంతమయిపోయింది.

ముప్పైఅయిదేళ్ళు నౌఖరీచేసి, ఆ నౌఖరీకి అర్హత సంపాదించుకొందికి మొదటి ఇరవై ఏళ్ళూ గడిపిన మనిషిని ఒక పదేళ్ళపాటయినా నిబ్బరంగా బతకడాగకి వీలులేని మొత్తంతో బలవంతంగా విశ్రాంతిని పొందమంటె, పొందలేకపోవడానికి అతని అత్యాశే కారణం అనలేము—ఉద్యోగంనుండి, విశ్రాంతిపొందడం ఎంత తప్పనిసరేనా, కుటుంబ యాజమాన్యమును తదనంతరంకూడా మెడకు అంత తప్పనిసరిగా కట్టుకోవలసిరావడంకూడా అంతే తప్పనిసరే బహుమంది మధ్యతరగతి కుటుంబీకులకు—ఏమైతేనేం, జగన్నాథంపంతులు నిజంగా అదృష్టవంతుడే — ఒక ఆరునెలలు మానసిక వ్యథతో కొద్దిపాటి శారీరక శ్రమతో అవతలి ఒడ్డున చేరగలిగేడు.